క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: పట్టణంలోని భరత్‌నగర్, కొత్త బస్టాండ్ కాలనీల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ అయిజ సబ్ డివిజన్ ఏడీఈ నీలి గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భరత్‌నగర్‌లో లో ఓల్టేజీ సమస్య ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ అవుతోందని, దాని వల్ల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాని వల్ల పట్టణంలోని 11 కేవీ టౌన్ 2 ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు నాగర్‌దొడ్డి, తూంకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని వారు కోరారు.

విద్యుత్ వైర్లతో పొంచిఉన్న ముప్పు



మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడు గ్రామానికి వెళ్లే రహదారి చెట్లపై విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. గోకులపాడు గ్రామంలో హరితహారంలో భాగంగా నాటి మొక్కలు విద్యుత్ వైర్ల వల్ల ఎర్త్ వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ ఎర్త్ రాకుండా చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించండి



మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ నుంచి చెన్నిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. చాలా ఏండ్లుగా గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. రైతులు, ప్రజలకు నిత్యం ప్రయాణించే రోడ్డు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాటికుంట రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్లమొర్సు గ్రామం మధ్యన బీటీ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు మల్దకల్, రాముడు, కిష్టన్న, వెంకటన్నలు కోరారు. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 8ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నా యని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రో డ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గుంతలు పూడ్చండి

మానవపాడు: మండలంలోని మానవపాడు నుంచి గోలకుపాడు గ్రామానికి వెళ్లే రహదారి వంతెనపై గుంతలతో ప్రమాదకరంగ తయారైంది. రాత్రి సమయంలో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. నిత్యం ఈ రహదారి గుండా చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు, తదితర ప్రధాన రహదారులకు ప్రయాణం చేస్తుంటారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల వ్యవసాయం: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య సూచించారు. ఆదివారం గద్వాల పట్టణంలోని దౌదర్‌పల్లి, మండలంలోని అనంతపురం, పుటాన్‌పల్లి గ్రామాల్లో పశువైద్య సిబ్బంది 55మంది రైతులకు చెందిన 677 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కృష్ణయ్య, రాముడు, గోపాల మిత్రలు ప్రభాకర్, నర్సింహ, బుద్దుడు, జహంగీర్ పాల్గొన్నారు.

తుమ్మిళ్లలో ప్రమాద ఘంటికలు

- డెడ్ స్టోరేజీకి తుంగభద్ర నది
- రంగు మారి, దుర్వాసన వస్తున్న నీరే సరఫరా
- స్నానం చేస్తే ఒళ్లంతా దురద
- తాగేందుకు ప్రైవేట్ ప్లాంట్లకు పరుగులు



తుంగభద్ర నదిలో అడుగంటిన నీటి మట్టం

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామం అంటే గద్వాల జిల్లాలోనే కాదు దాదాపు రాష్ట్రానికే సుపరిచితమైన పేరు. తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా 55 వేల ఎకరాలకు నీరందిస్తున్న పథకానికి పురుడు పోసుకున్నది ఇక్కడే. అలాంటి గ్రామంలో నేడు 4 వేల మంది గొంతు తడిపేందుకు నీరు సరిపోవడం లేదు. ఆర్‌డీఎస్ ఆయకట్టును సస్యశ్యామలం చేసిన తుమ్మిళ్ల నేడు సొంత గ్రామంలో నీటి అవసరాలు తీర్చుకోలేక చతికిల పడుతోంది. తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల డ్యాంకు ఎగువనున్న ఈ గ్రామంలో బ్యాక్ వాటర్ ఉండటంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించారు. నేడు గ్రామానికి సరిపడ నీరు కూడా లేకపోవడంతో గ్రామస్తులు నీటి అవసరాలు తీర్చుకునేందుకు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవకపోవడం, ఎండలు ముదురుతుండటంతో నదిలో నీరు అడుగంటిపోతోంది. మరో 20 రోజుల్లోగా నదిలో ఉన్న నీరు మొత్తం ఎండిపోయే పరిస్థితి కనిపిస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి అవసరాలను తీర్చుకునేందుకు చేపడుతున్న చర్యలు విఫలమవుతున్నాయని, దీంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాలుగు వేల జనాభా..

నాలుగు వేల మంది జనాభా ఉన్న గ్రామంలో 2,400 మంది ఓటర్లు ఉన్నారు. వారి అవసరాల కోసం గ్రామంలో మూడు నీటి ట్యాంకులు నిర్మించగా, అందులో ఒకటి మిషన్ భగీరథ ద్వారా నిర్మిస్తే, మరో రెండు అప్పటికే నిర్మించిన వాటర్ ట్యాంకుల ద్వారా గ్రామంలో నీటిని సరఫరా చేస్తున్నారు. నదీ తీర గ్రామం కావడంతో గ్రామంలో నీటి ఎద్దడి ఉండదని భావించినప్పటికీ ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా నదిలో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది. రెండు వారాలుగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు నీటి ఎద్దడి రాకుండా చర్యల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. నదిలో ఉన్న కొద్దిపాటి నీటిలోనే మోటార్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఐదు బిందెల కంటే ఎక్కువ నీరు రావడం లేదు. ఆ నీరు కూడా రోజూ రాకపోవడంతో స్థానికంగా ఉన్న నది నీటిపైనే ఆధారపడక తప్పడం లేదు.



తుంగభద్ర నది నీటి కుంటల్లో ఏర్పాటు చేసుకున్న మోటార్లు

ఆందోళనకరంగా నది నీరు..

నదిలో ఉన్న కొద్దిపాటి నీరు కూడా రంగు మారిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నదిలో నీరు అడుగంటడంతో చేపలు చనిపోయి, నీరంతా దుర్వాసన వస్తోంది. ఆ నీటితో స్నానం చేస్తే శరీరమంతా దురద ఏర్పడుతోంది. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో నదిలో నీటినే కొళాయిలకు సప్లై చేసుకుని వాడుకుంటున్నారు. నదిలో ఇప్పటికే బోర్లు వేసినా ఫలితం లేదు. గ్రామంలో మొత్తం బండ ఎక్కువగా ఉండటంతో బోర్లు వేసినా ఫలితం శూన్యం. మరో రెండు వారాలు గడిస్తే ఉన్న నీరు కూడా ఇంకిపోతుంది. అంతలోపే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆ నీటితోనే కాలం వెళ్లదీస్తున్నాం



నదిలో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఆ నీటినే వాడుకుంటున్నాం. నది బయట వైపు బోర్లు వేస్తే పడవు. నదిలో కూడా బోర్లు వేసేందుకు ప్రయత్నించి నా ఫలించలేదు. చెలిమలు తవ్వుకుంటే అవి కూడా ఇంకిపోతున్నాయి. మిషన్ భగీరథ ద్వారా నీరు 5 బిందెల కంటే ఎక్కువ రావడం లేదు. పంప్‌హౌస్ నుంచి పైప్‌లైన్ చేస్తే శాశ్వత పరిష్కారం ఉంటుందని అధికారులకు చెప్పాం. దానిపై దృష్టి పెట్టాలి.

– గజేంద్ర, తుమ్మిళ్ల

శరీరంపై దురద వస్తోంది..



నదిలో కొద్ది నీటినే కుంటలు ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా తీసుకుని వాడుకుంటున్నాం. కాని ఆ నీరు దుర్వాసన వస్తోంది. స్నానం చేస్తే శరీరంపై దురద ఏర్పడుతోంది. నీరు రంగు మారిపోయింది. ఆ నీరు కూడా ఇంకిపోయే దశలో ఉంది. తాగునీటి కోసం ప్రైవేట్ ప్లాంట్లకు పరుగులు పెట్టక తప్పడం లేదు. అధికారులు తీసుకునే చర్యలు వేగంగా పూర్తి చేస్తే ప్రజలకు ప్రయోజనం ఉంటుంది.

– మల్లికార్జున్, తుమ్మిళ్ల

చర్యలు తీసుకుంటాం..

నదిలో నీరు డెడ్ స్టోరేజీకి వచ్చిన విషయం మా దృష్టికి రావడంతో గ్రామానికి వెళ్లి పరిశీలించాం. నీటి ఎద్దడి రాకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేతి పంపులు బాగు చేయించి, ఇతర నీటి వనరులున్న చోట మోటార్లు ఉపయోగించి నీటిని అందించేందుకు ప్రణాళిక రూపొందించాం. సంబంధిత అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతాం.

– రమేష్, ఎంపీడీఓ, రాజోళి

ఘనంగా మట్టల ఆదివారం



ధరూరులో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు, చిన్నారులు

ధరూరు: మట్టల ఆదివారం క్రైస్తవులు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ధరూరు, మార్లబీడు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే కి ముందు ఏసు క్రీస్తు అనుభవించిన శ్రమల దినాలను స్మరించుకుంటూ అందుకు సాదృశ్యంగా ఈ మట్టల ఆదివారం నిర్వహిస్తున్నట్లు ధరూరు ఎంబీ షాలేము చర్చి పాస్టర్ సీపీ ప్రసాద్ యూదా తెలిపారు. గ్రామంలో చిన్నారులు, పెద్దలు, యువతీ యువకులు ఈత మట్టలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దేవన్న, సుదర్శన్, జకరయ, మత్తయి, మోషె, ఇస్సాక్, ఏలీషా, సత్యన్న, దానియేలు, యూత్ నీరజ్, టైలర్ సురేష్, విజయ్, హేబేలు పాల్గొన్నారు.

రాజోళి: మట్టల పండుగను మండలంలోని తూర్పు గార్లపాడులో ఘనంగా ని ర్వహించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సులేమాన్, యువకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ బేతేలు చర్చి పాస్టర్ రెవరెండ్ సీమోను అధ్యక్షతన పట్టణంలో క్రైస్తవులు ఈత చెట్టు మట్టలను చేతిలో పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడారు. ఏసుక్రీస్తు ఈలోకంలోకి రావడానికి ప్రవక్తల లేఖనాలు, ధర్మశాస్త్ర లేఖనాలు, కీర్తన లేఖనాలు, తండ్రి చిత్తిని నెరవేర్చుటకు పావుల నిమిత్తం ఈలోకానికి వచ్చాడని అన్నారు. లోకంలో ఉన్న మానవులు పాపంచే కట్టబడి ఉండగా వారిని విడిపించి పరలోక వారసులుగా చేశాడని పాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



తూర్పుగార్లపాడులో మట్టల పండుగ

శాంతినగర్: క్రీస్తు సోదరులు మట్టల పండుగ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ఈత మట్టలను చేత పట్టుకుని గ్రామాల్లోని వీధుల్లో పాటలు పాడుతూ తిరిగారు. క్రీస్తు సందేశాలు ప్రజలకు వివరిస్తూ మట్టల పండుగ ప్రత్యేకత గురించి అవగాహన కల్పించారు. బంధువులతో కలిసి మట్టల పండుగ నిర్వహించారు.



అయిజలో మట్టల పండుగ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కాముడి దిష్టిబొమ్మ ఊరేగింపు



అమరచింత జగన్‌వాడలో కాముడి దిష్టిబొమ్మకు పాడె సిద్ధం చేసిన యువకులు



పట్టణంలోని బీసీ కాలనీలో కాముడి శవయాత్ర

అమరచింత: కాముడి పూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని జగన్‌వాడ, బీసీ కాలనీలో ఆదివారం కాముడి దిష్టిబొమ్మతో శవయాత్రను పట్టణ పురవీధుల వెంట నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన యువకులు, చిన్నారులు కాముడి దిష్టిబొమ్మను తయారు చేసి వాటిని పాడెపై పడుకోబెట్టి ఊరేగించారు. పాడె ముందు మహిళ వేషధారణతో అయ్యో నా మొగుడు చనిపోయాడమ్మ దహన ఖర్చులకు సాయం చేయ్యండమ్మా అంటూ ఏడుస్తూ డబ్బులను వసూలు చేశారు. వీటిని పోగు చేసి కాముడిని దహనం చేస్తూ.. గుగ్గిళ్లను అదే మంటలో ఉడకబెట్టి వాడంతా పంచడం ఆనావాయితీగా వస్తుందని యువకులు తెలియజేశారు.

రోడ్డుకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: అలంపూర్–రాయచూర్ రోడ్డు గుంతలమయమై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. శాంతినగర్ నుంచి అలంపూర్ వరకు ఉన్న 20 కిలోమీటర్ల ప్రధాన రహదారిలో అక్కడక్కడ గుంతలకు బీటీతో ప్యాచ్‌లు వేశారు. దీంతో ప్రయాణికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. శాంతినగర్ నుంచి అయిజ వరకు 22 కిలోమీటర్ల రహదారిలో ఏర్పడిన గుంతలను పట్టించుకోవడంలేదని, వాటికి కూడా ప్యాచ్‌లు పూర్తి స్థాయిలో వేసి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయండి

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి గ్రామ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి కావడం, అర్ధంతరంగా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడంతో గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు కూడా నిలిపివేశారు. ఉన్నతాధికారులు స్పందించి నిలిపివేసిన బస్సులను పునరుద్ధరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యూనిఫాం కుట్టు కూలీ విడుదల

పాన్‌గల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి గతేడాది యూనిఫాం కుట్టిన వారి కూలీ చెల్లింపులకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసిందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో మార్చి నెల ముగింపు కావడంతో బకాయిలు చెల్లించిందని, మండలంలోని ప్రభుత్వ, కస్తూర్బా పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమయ్యాయని పేర్కొన్నారు. యూనిఫాం కుట్టిన దర్జీలు కూలీ కోసం ఏడాది కాలంగా నిరీక్షించారని అన్నారు. ఇన్నాళ్లకు వారి ఎదురుచూపులు ఫలించాయన్నారు. మండలంలో 3 ప్రాథమికోన్నత, 36 ప్రాథమిక, 10 ఉన్నత, 1 కస్తూర్బా విద్యాలయంతో కలిపి మొత్తం 3,663 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులకు సంబంధించిన రూ.3.66 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. మంజూరైన నిధులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల నుంచి దర్జీలకు అందజేస్తారన్నారు. డబ్ల్యూఎన్‌పీ502– యూనిఫాంతో విద్యార్థులు



హోలీలో నిబంధనలు పాటించాలి



ఎస్‌ఐ చంద్రకాంత్

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం హోలీ పండుగ సందర్భంగా ప్రజలు, యువకులు సూచనలు, సలహాలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు హోలీ పండుగపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హోలీ ఆడేటప్పుడు కెమికల్స్ వాడొద్దని తెలిపారు. ద్విచక్ర వాహనాలను రాష్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకోని వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ లక్ష్మన్‌గౌడు పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్త్‌తో పాటు తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, రంజిత్ సిబ్బంది ఉన్నారు.



నందిన్నె చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ

రాజోళి: మండల ఎంపీపీ మరియమ్మ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆమె తన భర్త నతానియేల్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఆమె కాంగ్రెస్‌లో చేరడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఆమెతో పాటు రాజోళి–3 ఎంపీటీసీ చిట్టెమ్మ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారికి సంపత్ కుమార్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలో అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకుని, సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలన నచ్చి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి, భాస్కర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ మరియమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మలను ఆహ్వానిస్తున్న సంపత్‌కుమార్

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని నిరసన

గద్వాల అర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ఫీజును తగ్గించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చాక పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. ఒక్కొక్క పేపర్‌కు రూ.1000లకు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే టెట్ ఫీజులను తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, చందు, నరేష్, నర్సింహులు, రంగస్వామి తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

రోడ్డు పాడై.. ప్రమాదాలకు నెలవై..

- అధ్వానంగా గద్వాల–రాయచూర్ రోడ్డు
- అడుగడుగునా గుంతలతో నరకయాతన
- గాయాలపాలవుతున్న వాహనదారులు



గుంతలుగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కేటీదొడ్డి: గద్వాల–రాయచూర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు మార్గం నుంచి వందలాది వాహనాలు వెళ్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు అధ్వానంగా మారింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైనా పట్టించుకునే వారు లేరు. గుంతలు పడి కొని సంవత్సరాలైనా పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది.

పది కిలోమీటర్లు మేర గుంతలు..

ఉమిత్యాల–కొండాపురం మధ్య పలు చోట్ల రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. సుమారు పది కిలోమీటర్ల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపైన ఉన్న తారు లేచి గుంతలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా కంకర రాళ్లు పైకి తేలాయి. రాత్రి సమయంలో వాహనదారులకు ఈ గుంతలు దగ్గర కొచ్చే వరకు కన్పించడం లేదు. గుంతలో పడినప్పుడు అందులో ప్రయాణిస్తున్న వారు నడుములు విరిగేలా ఎగిరిపడాల్సి వస్తోంది. ఒక్కోసారి బస్సు ముందున్న కడ్డీలకు తగిలి గాయాలైన సంఘటనలున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇటీవల భారీ గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సిగ్నల్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో కనీసం తాత్కాలిక మరమ్మతులు సైతం చేయలేదు.

మరమ్మతు చేపట్టాలి..



ఉమిత్యాల–కొండాపురం, కేటీదొడ్డి–నందిన్నె, కొండాపురం–మైలగడ్డ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పాడై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. తక్షణమే గుంతలను పూడ్చి శాశ్వతంగా రహదారిని బాగు చేయాలి.

– రమేష్, కొండాపురం

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. గద్వాల–రాయచూర్ రోడ్డు ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక, సూచన బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు నివారణకు అవగాహన కల్పించాలి. రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– రేణప్ప, కేటీదొడ్డి

రాలుతున్న మామిడి కాయలు

వీపనగండ్ల: అధిక ఉష్ణోగ్రతలతో మామిడితోటల్లో వచ్చిన కొద్దిపాటి మామిడికాయల దిగుబడి రాలుతుండడంతో మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ యాసంగిలో దాదాపు 80 శాతం తోటలు దిగుబడికి నోచుకోలేదు. కొద్దిపాటి మామిడికాయలకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని మామిడి తోటల రైతులు కోరుతున్నారు. సమీప పట్టణమైన కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.